జిందగీ చింతన

నమస్తే తెలంగాణ హైదరాబాద్

సోమవారం 18 డిసెంబర్ 2023


www.ntnews.com






## నారదుని గర్వభంగం!

అమృతవాణి



**ఒకసారి నారదుడికి** తన కంటే గొప్పభక్తులు లేరని గర్వం పొడచూపిందట. అతడి మనసు తెలుసుకున్న మహావిష్ణువు 'నారదా! భూలోకంలో నా పరమభక్తుడు ఒకరు ఉన్నాడు. అతణ్ని కలిసి రా! భక్తి అంటే ఏంటో తెలుస్తుంది' అని చెప్పాడు. నారదుడు 'నా కంటే స్వామికి గొప్ప భక్తుడు ఎవరు ఉంటారు?' అని సంశయిస్తూనే భూమిపైకి వచ్చాడు. ఈ భక్తుడు ఓ రైతు. ఉదయాన్నే లేచి ఓసారి హరి నామస్మరణ చేసుకొని, పొలానికి వెళ్లి రోజంతా పనులు చేసుకుంటున్నాడు. రాత్రి నిద్రపోయే ముందు మరోసారి మనస్ఫూర్తిగా శ్రీహరిని స్మరించుకుంటున్నాడు. 'ఈ పల్లెటూరి రైతు మహావిష్ణువు భక్తుడెలా అవుతాడు? రోజంతా పొలం పనుల్లోనే ఉంటున్నాడు?' అని మనసులో అనుకున్నాడు నారదుడు. అదే విషయాన్ని విష్ణుమూర్తి ముందు వెలిబుచ్చాడు. అప్పుడు వైకుంఠధాముడు ఆ త్రిలోక సంచారికి ఓ నూనె గిన్నె ఇచ్చి, 'దీనిని ఒక్క బొట్టు కూడా ఒలకకుండా వైకుంఠమంతా ప్రదక్షిణ చేసిరా' అన్నాడు. ఆ మునీశ్వరుడు నిష్ఠగా నూనె చుక్క కూడా ఒలకకుండా ప్రదక్షిణ చేసి వచ్చాడు. అప్పుడు ఆ శేషశయనుడు 'నారదా! ఈ ప్రదక్షిణ సమయంలో నన్ను ఎన్నిసార్లు తలచుకున్నావు?' అని ప్రశ్నించాడు. 'ఒక్కసారి కూడా లేదు స్వామీ! అయినా నిండుగా ఉన్న ఆ నూనె గిన్నె ఎక్కడ తొణుకుతుందో అన్న ఆలోచనలో మీ నామాన్ని తలచుకోవటం ఎలా కుదురుతుంది?' అని బదులిచ్చాడు. అప్పుడు ఆ జగన్నాథుడు 'ఓ నూనె గిన్నె నీ మనసును నా మీద నుంచి పక్కకు మరల్చి నన్నే మరచిపోయేలా చేసింది. కానీ, ఆ రైతు చూడు రోజంతా బండెడు కుటుంబ బాధ్యతల్ని మోస్తూ కూడా రోజుకు విధిగా రెండుసార్లు తలచుకుంటున్నాడు. ఆయన గొప్పభక్తుడే కదా!' అన్నాడు. రామకృష్ణ పరమహంస తన శిష్యులకు ఈ కథ చెబుతూ గృహస్థుల భక్తి ఎంతో గొప్పదని కొనియాడారు.

... మనోజ్ఞ

## సరైన గుర్తింపు

కథాసుధ



ఒక ఊర్లో తిరునాళ్లకు హరికథ ఏర్పాటు చేశారు. హరికథ చెప్పడానికి ప్రముఖ భాగవతార్ తన బృందంతో వచ్చాడు. 'పాండవ వనవాసం' కథను అందుకున్నాడు. అప్పుడప్పుడూ కథకుడు 'గోవింద'లు చెబుతున్నాడు. అన్నీ బాగానే ఉన్నా.. ఆయనలో ఉత్సాహం కనిపించడం లేదు. పక్కవాద్యగాళ్లూ అంతే నిరుత్సాహంగా కనిపించారు. హరికథ వినడానికి వచ్చిన భక్తులు మెల్లగా అక్కణ్నుంచి జారుకోవడం మొదలుపెట్టారు. విషయం గ్రహించిన ఊరి పెద్ద.. తమ గ్రామానికి చెందిన వృద్ధ కళాకారుడితో 'అయ్యా! కథాగానం ఇలా చప్పగా సాగితే.. భక్తులు ఉండేలా లేరు' అన్నాడు. అప్పుడా పెద్దాయన.. 'కళాకారులకు ధనవస్తు వాహనాల కన్నా.. గుర్తింపు ముఖ్యం. చిన్నపాటి మెప్పుతో పొంగిపోతారు. మంచి పూల దండ తెచ్చి అతని మెడలో వేయండి' అని చెప్పాడు. నిర్వాహకులు పరుగున వెళ్లి ఓ దండ తెచ్చి భాగవతార్ మెడలో వేశారు. రెట్టించిన ఉత్సాహంతో కథ మొదలుపెట్టాడు భాగవతార్. తన ఆంగిక అభినయాలతో ప్రతి ఘట్టాన్నీ కండ్లకు కట్టినట్టు వర్ణించసాగాడు. భక్తులు మహదానందం పొందారు. అందరూ భక్తిశ్రద్ధలతో 'గోవింద'లు పలికారు.

... ఆర్.సి.కృష్ణస్వామి రాజు, 93936 62821

# రాత మార్చే గీత!

శనివారం గీతాజయంతి

నారాయణుడు సారథి.
నరుడు మహారథి.
రథి ఆజ్ఞాపించాలి..
సారథి ఆచరించాలి.
కురుక్షేత్రంలో ఇందుకు
భిన్నమైన సన్నివేశం
కనిపిస్తుంది.
సారథి ఆజ్ఞాపించాడు..
రథి ఆచరించాడు.
నారాయణుడు శాసించాడు..
నరుడు శ్వాసించాడు.
జగద్గురువు ఉపదేశించాడు..
అర్జునుడు సాధించాడు.
ఆ జ్ఞానబోధ.. అర్జునుడికి
మాత్రమే పరిమితం కాలేదు.
శ్రీకృష్ణపరమాత్మ బోధించిన
గీత.. ఎందరెందరి
తలరాతలనో మార్చింది.
భగవానుడి దివ్యోపదేశం
ఒకసారి ఆలకిస్తే..

పద్దెనిమిది అధ్యాయాలు.. ప్రతి యోగమూ పార్థుడి మనసులో ఇంకిపోయిన జిజ్ఞాసను తట్టిలేపిందే! 700కు పైగా శ్లోకాలు.. అన్నీ అర్జునుడి శోకాన్ని పరిమార్చినవే! విషాద యోగంలో 'న కాంక్షే విజయం కృష్ణ..' అని గాండీవం పక్కనపెడతాడు పార్థుడు. 'కృష్ణా! విజయం, రాజ్యం ఇవేవీ అక్కర్లేదు' అని నిర్లిప్త ధోరణిని ప్రదర్శిస్తాడు. నిరాశకు లోనైన అర్జునుణ్ని 'ఇలాగైతే ఎలా.. యుద్ధం చేయాల్సిందే! లేకపోతే కుదరదు' అని గద్దించలేదు కృష్ణుడు. అక్షరాలు రాయనని మారాం చేసిన విద్యార్థిని లాలించి, బుజ్జగించి తన మాట వినేలా చేసుకునే గురువులా.. పార్థుడి మనసును జగద్గురువు తనవైపునకు తిప్పుకొన్నాడు. 'ముందుగా ఆ పిరికితనాన్ని విడిచిపెట్టు' అని బుజ్జగించి అసలు కర్తవ్య బోధకు సిద్ధమయ్యాడు.

సాంఖ్యయోగంలోనే గీతాసారమంతా కనిపిస్తుంది. ముందుగా ఏది సత్యం, ఏది అసత్యం అని గుర్తుచేసి, అర్జునుడిని చుట్టుముట్టిన సందేహాలను ఒక్కొక్కటిగా పరిష్కరించాడు గీతాచార్యుడు. విద్యార్థికి కిందితరగతి పాఠాన్ని పునశ్చరణ చేసిన తర్వాత అసలు పాఠాన్ని బోధించినట్టుగా.. అర్జునుడు కాస్త కుదుటపడ్డాడు అని గ్రహించిన తర్వాత అసలు బోధకు పూనుకున్నాడు జగద్గురువు. మూడోదైన కర్మయోగంలో 'చేయాల్సిన పని చేసి తీరాల్సిందే.. ఏ పనీ చేయకుండా ఉంటే శరీరయాత్ర సాగదు' అని కర్మజ్ఞానాన్ని అందించాడు. ఆ తర్వాతి అధ్యాయమైన జ్ఞానయోగంలో జ్ఞానాన్నీ, కర్మనూ సమన్వయం చేస్తూ పార్థుడికి దిశానిర్దేశం చేశాడు.

'కర్మలు చేయలా, వద్దా' అన్న అర్జునుడి ప్రశ్నకు బదులుగా ఉపదేశించినదే కర్మసన్యాసయోగం. ఏది చేయాలో, ఏది వదిలిపెట్టాలో తెలుసుకోవడమే ఇంగితం. కర్మను ఆచరించినా, త్యజించినా ఎరుకతో చేయాలి. ఈ రెండిటిలో కర్మ చేయడమే శ్రేష్ఠమైనదని గీతాచార్యుడి భావన. కర్మ ఎలా చేయాలో విశదపరిచి అర్జునుడి విషాదాన్ని పరిమార్చాడు. శక్తియుక్తులు ఉన్న వ్యక్తి ఆత్మసంయమనంతో లేకపోతే.. అతను ఆచరించే కర్మలు ఒక్కోసారి వినాశనానికి దారితీయొచ్చు. మనసు, ఆత్మ రెండిటినీ అదుపులో ఉంచుకున్నప్పుడే బుద్ధి చేతనం పొందుతుంది. సత్కర్మ ఆచరించే అవకాశం ఏర్పడుతుంది. ఇదే విషయాన్ని ఆత్మసంయమయోగం ద్వారా తెలియజేశాడు పరమాత్మ. ఇలా ఒక్కో అధ్యాయంలో జ్ఞానాన్ని, తాత్విక చింతనను పెంపొందిస్తూ, కర్తవ్యాన్ని పదేపదే గుర్తుచేస్తూ అర్జునుణ్ని కార్యోన్ముఖుణ్ని చేశాడు.

చివరిగా.. 'నేను చెప్పినదంతా శ్రద్ధగా విన్నావా? అతి రహస్యమైన జ్ఞానాన్ని నీకు తెలియజేశాను. ఇక నీకు తోచిన విధంగా చేయవచ్చు' అని నిర్ణయాధికారం అర్జునుడికే వదిలేశాడు శ్రీకృష్ణుడు. దీనికి బదులుగా అర్జునుడు 'అచ్యుతా! నీ కృపతో నా మోహం నశించింది. ఇప్పుడు నాకు ఏ సంశయమూ లేదు. నీ ఆజ్ఞను శిరసావహిస్తాను' అని గాండీవం అందుకున్నాడు. అనాడు అర్జునుడు మాత్రమే కాదు, గీతాసారం గ్రహించిన ప్రతి ఒక్కరూ సత్యాన్ని గ్రహించగలుగుతారు. తన కర్తవ్యం ఏమిటో గుర్తించగలుగుతారు. దాన్ని ఎలా నిర్వర్తించాలో స్పష్టతకు వస్తారు. ప్రణాళికాబద్ధంగా జీవితాన్ని తీర్చిదిద్దుకోగలుగుతారన్నది నిస్సంశయం.

... కణ్వస

# ఉత్తర ద్వారం.. ఉత్తమ మార్గం

శనివారం ముక్కోటి ఏకాదశి



**హిందూ** సంప్రదాయంలోని దాదాపు అన్ని పండుగలూ చాంద్రమానం ప్రకారం చేసుకుంటాం. 'వైకుంఠ ఏకాదశి' పర్వదినాన్ని సూర్యుడి నడక ఆధారంగా నిర్ణయిస్తాం. సూర్యుడు ధనుస్సు రాశిలోకి ప్రవేశించిన నాటి నుంచి 'ధనుర్మాసం' మొదలవుతుంది. ధనుర్మాసంలో వచ్చే శుక్ల ఏకాదశిని 'వైకుంఠ ఏకాదశి', 'ముక్కోటి ఏకాదశి'గా భావిస్తారు. ఈ రోజు ముక్కోటి దేవతలకు వైకుంఠ ద్వారంలో శ్రీ మహావిష్ణువు తన దివ్యదర్శనం అనుగ్రహించిన పర్వదినమిది. అలా వైకుంఠ ఉత్తర ద్వారంలో ముక్కోటి దేవతలకు దర్శనమిచ్చిన విష్ణుమూర్తి ఆ మార్గంలోనే భూమికి దిగివచ్చాడనీ, మురాసురుడనే రాక్షసుణ్నీ సంహరించాడనీ పురాణ కథనం. అందుకే ముక్కోటి ఏకాదశి సందర్భంగా వైష్ణవ క్షేత్రాలలో భక్తులు విష్ణుమూర్తిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకునే సంప్రదాయం ఏర్పడింది.

ముక్కోటి ఏకాదశి నాడు విష్ణుగాథలు వినాలి. సంకీర్తనం చేయాలి. ఆరోగ్యవంతులు ఉపవాస దీక్ష ఆచరించాలి. మనకు ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, ఆపై మనసును పదకొండో ఇంద్రియంగా పెద్దలు చెబుతారు. ఈ ఏకాదశ ఇంద్రియాలు మంచి మార్గంలో ప్రవర్తించటం 'వైకుంఠ ఏకాదశి' ముఖ్య ఉద్దేశం కావాలి. 'కుంఠం' అంటే లోపం. లోపం లేకుండా ఉండటం అంటే 'వికుంఠం'. అంటే సక్రమంగా వ్యవహరించటం. ఏకాదశ ఇంద్రియాలకు వికుంఠ స్థితిని ప్రసాదించే పర్వదినం వైకుంఠ ఏకాదశి. మనసు, ఇంద్రియాలూ, వీటి ప్రవృత్తులు కోటానుకోట్లు. ఆ మనసు సత్వ, రజ, స్తమో గుణాల ప్రకారం పని చేస్తుంది. ఆ ప్రవృత్తులను ముక్కోటి దేవతలుగా సంకేతరూపంలో సూచించారు పెద్దలు. ఈ ప్రవృత్తులన్నీ 'ఉత్తర' ద్వారం వెంబడి ప్రయాణించటం అంటే 'యోగసాధన' అని అర్థం. అలా యోగ సాధన సక్రమంగా సాగినవేళ కలిగే దివ్యానందమే హృదయంలో కలిగే విష్ణు దర్శనం. ఆనాడు జీవుడి మనః ప్రవృత్తులు ఉన్నమార్గం కన్నా ఉన్నతమైన మార్గంలో ప్రయాణిస్తాయి. అదే ఉత్- తర- ద్వార దర్శనం. ఈ అంతరార్థాన్ని గమనించి ప్రవర్తించిన వేళ ఈ వైకుంఠ ఏకాదశి పర్వదినం మొక్కుబడిగా మిగిలిపోక సార్థకమవుతుంది.

... శ్రీ

# మహామతి.. సేనాధిపతి!

నేడు సుబ్రహ్మణ్య షష్ఠి



మార్గశిర శుద్ధ షష్ఠిని 'సుబ్రహ్మణ్య షష్ఠి'గా చేసుకుంటారు. దేవతలకు సేనా నాయకత్వం వహించి సుబ్రహ్మణ్యుడు తారకాసుర సంహారం చేసిన పర్వదినం ఇదే. కుమారస్వామి, కార్తికేయుడు, స్కందుడు, శరవణభవుడు అని సుబ్రహ్మణ్యుడికి పేర్లు. కుమారస్వామికి ఆరు ముఖాలు. కనుక షణ్ముఖుడని కూడా పేరు. కార్తికేయుడిని 'మహామతి'గా అభివర్ణిస్తారు. ఆయన బుద్ధిని ప్రేరేపించే స్వామి. సుబ్రహ్మణ్య ఆరాధనతో మనోబలం లభిస్తుంది. బుద్ధి ప్రచోదనం అవుతుంది. సత్కర్మలు చేయడానికి ప్రేరణ కలుగుతుంది. 'బుద్ధి శక్తి దేవత' అని శరవణభవుణ్ని స్తుతిస్తారు. ఆయన ఉపాసనతో దుష్కర్మలు చేయాలన్న తలంపు తొలగిపోతుంది. సత్కర్మలు ఆచరించాలన్న బుద్ధి పుడుతుంది. సజ్జనుల క్షేమం కోసం ఆవిర్భవించిన సుబ్రహ్మణ్యుడు బుద్ధిని ప్రచోదనం చేస్తాడు. శక్తి కుమారుడికి ఇచ్చిన శూలాన్ని.. జ్ఞానశూలం అనడం వెనుక ఆంతర్యం కూడా ఇదే!

సుబ్రహ్మణ్యస్వామిని సర్పాలకు మూలదేవతగా భావిస్తారు. ఆయన వాహనం నెమలి. రెండు విరుద్ధ భావనలను, ధర్మాలను ఒక్కతాటిపై సమంగా నిలిపే శక్తి దైవానికి ఉంది. అందుకే నెమలి వాహనుడైన కుమారస్వామి సర్పాలకు అధిదేవతగా అనుగ్రహిస్తున్నాడు. అంతేకాదు, సుబ్రహ్మణ్యస్వామిని సంతాన కారకుడిగా, సంపత్తి దాతగా, ఆరోగ్య ప్రదాతగా భావిస్తుంటారు. స్వామి అనుగ్రహంతో ఇవన్నీ సిద్ధిస్తాయని విశ్వసిస్తారు. స్వామి అనుగ్రహం కోసం సుబ్రహ్మణ్య షష్ఠి నాడు పేదలకు దుప్పట్లు, కంబళ్లు దానం చేసే 'ప్రావరణ వ్రతం' నిర్వహించాలని పెద్దలు చెప్తారు. చలికాలంలో వచ్చే ఈ పర్వదినాన పేదల చలిబాధను నివారించడమే వ్రతంలోని ఆంతర్యం.

## పుణ్యం-పాపం

ఇస్లాం బోధ

పాపులు, పుణ్యాత్ములు మరణించే సమయంలో పొందే అనుభవాన్ని ముహమ్మద్ ప్రవక్త (స) ఒక సందర్భంలో ఇలా వివరించారు. మనిషికి మరణ సమయం ఆసన్నమైనప్పుడు అతని ప్రాణాన్ని తీసుకుపోవడానికి దైవదూతలు ప్రత్యక్షమవుతారు. శరీరం నుంచి ఆత్మను వేరుచేసి ప్రభువు దగ్గరికి తీసుకెళ్తారు. మంచి జీవితం గడిపిన పుణ్యాత్ముల ప్రాణం తీయడానికి సాధు స్వభావం కలిగిన ముఖవర్చస్సు, కాంతిమంతమైన శ్వేత వస్త్రాలు ధరించిన మృత్యుదూతలు వస్తారు. ప్రాణాలు కోల్పోతున్న ఆ వ్యక్తిని మృధువుగా పలకరిస్తారు. 'ఓ పవిత్రమైన ఆత్మగలవాడా, నీ ప్రభువు వద్దకు వెళ్దాం పదా! నీ పట్ల ప్రభువు సంతృప్తిగా ఉన్నాడు' అంటూ దేహం నుంచి ఆత్మను వేరు చేస్తారు. పుణ్యాత్ముడి ఆత్మనుంచి సువాసనలు వెదజల్లుతుంటాయి. అల్లాహ్ ఆజ్ఞతో ఆత్మను విశ్వాసుల జాబితాలో రాస్తారు. విశ్వాసుల ఆత్మలుండే ఇల్లీయాన్ ప్రాంతానికి తీసుకెళ్తారు. అక్కడ ఆత్మ ప్రశాంతంగా సేద తీరుతుంది. అదే పాపాత్ముల ప్రాణాలు తీయడానికి వచ్చే మృత్యుదూతలు వికృతరూపాలలో కనిపిస్తారు. వీరి ఆత్మల నుంచి దుర్గంధం వస్తుంది. ప్రాణం తొలగించిన తర్వాత ఆ ఆత్మను ఆకాశంలోకి తీసుకెళ్లి బోర్లాపడవేస్తారు. ఇలాంటి వారి ఆత్మలను సిజ్జీయీన్‌ల జాబితాలో రాస్తారు. ఇలాంటి ఆత్మలకు నిత్యయాతన ఉంటుంది.

... ముహమ్మద్ ముజాహిద్, 9640622076

## మనసే మందిరం

స్మరణీయం



'రత్నైః కల్పిన మానసం హిమజలైః స్నానం చ దివ్యాంబరం' అని మొదలయ్యే ఆది శంకరుల శివ మానస పూజా స్తోత్రంలో అన్నీ హృత్కల్పితాలుగా పేర్కొన్నారు. 'హే పశుపతీ! హిమజలంతో స్నానం చేసి, దివ్య వస్త్రాలు ధరించినావని, రత్నాభరణాలతో అలంకరించుకున్నావని భావించాను. చందనం, కస్తూరి అలదుకుని రత్న సింహాసనంపై ఆసీనుడవై ఉన్నావని అనుకున్నాను. మల్లె, చంపక పుష్పాలు, బిల్వ పత్రాలు, ధూపం, దీపం స్వీకరించు..' ఈ సేవలన్నీ భక్తితో మానసికంగా సమర్పిస్తున్నాను అని ఈ శ్లోకం భావం. ఇలాగే ఆ ప్రసిద్ధ స్తోత్రంలో మరో నాలుగు శ్లోకాలు కనిపిస్తాయి.

ఏ భౌతిక సరంజామా లేకున్నా, మానసికంగా చేసే అర్చన. తమిళనాడులోని తిరువోత్రియూరులో పూసలారు అనే మహాభక్తుడు ఉండేవాడు. తను నమ్మిన దైవం అయిన శివుడికి భవ్యమందిరం కట్టించాలని కోరికగా ఉండేది. అయితే, గుడి కట్టించే స్తోమత పూసలారుకు లేదు. ఆ భక్తుడు తన మనసునే ఆలయంగా భావించాడు. ఆ రోజుల్లోనే ఒక పల్లవరాజు సమీపంలో శివాలయాన్ని నిర్మింపజేశాడు. పడింతులను సంప్రదించి ప్రతిష్ఠ ముహూర్తాన్ని నిర్ణయించాడు. ప్రతిష్ఠకు ముందురోజు ఆ రాజు కలలో శివుడు కనిపించి 'రేపు తీరిక లేదు. పూసలారు అనే భక్తుడి గుడిలో నా ప్రతిష్ఠ ఉంది. ముహూర్తం మార్చుకో!' అన్నాడట. రాజు కుతూహలంతో తిరువోత్రియూరుకు స్వయంగా వెళ్లాడు. అక్కడ పూసలారు ఏ గుడీ కట్టలేదు. విచారిస్తే.. తన మనసే మందిరం అన్నాడు పూసలారు. రాజు ఆ భక్తుడికి సాగిలపడ్డాడు. అందరూ పరమానందం చెందారు. మనోవాక్కాయాలలో మొదటిదైన మనసుకే ప్రాధాన్యమున్న మానస పూజతోనే పరమాత్ముడు ప్రీతిపాత్రుడు అవుతాడు.

... డా|| వెలుదండ సత్యనారాయణ